నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, బుధవారం 19 ఫిబ్రవరి 2025 | KHAMMAM

చండ్రుగొండ : కల్లాల్లో ఆరబోసిన మిర్చి

ధర దగా

- అదును చూసి మిర్చి రైతును దెబ్బ కొట్టిన వ్యాపారులు
- ఎర్ర బంగారం ధరలను అమాంతం తగ్గించిన బయ్యర్లు
- నిరుడు ఇదే సీజన్‌లో ఏకంగా రూ.22 వేలు పలికిన ధర
- సరిగ్గా ఏడాది తిరగకముందే రూ.12 వేలకు పతనం
- నిరుటి ధరలు చూసి ఈ ఏడాది విస్తీర్ణం పెంచిన ఎర్ర బంగారం రైతులు
- తెగుళ్లు సోకినా, పెట్టుబడులు పెరిగినా వెరవకుండా సాగు
- తీరా పంట చేతికొచ్చే సరికి నిలువునా పడిపోయిన ధరలు
- ధరల దగాతో గుండెలు బాదుకుంటున్న మిర్చి రైతులు
- కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదంటూ ఆవేదన

కల్లాల్లో మిర్చి ఏరుతున్న రైతులు

ధరల చదరంగంలో మిర్చి రైతులు నిలువునా దగా పడ్డారు. కాచుకొని కూర్చున్న వ్యాపారులు.. అదును చూసి దెబ్బ కొట్టారు. నిరుడు ఇదే సీజన్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో క్వింటాకు రూ.22 వేల చొప్పున వెచ్చించిన ఖరీదుదారులు.. ఈ ఏడాది సీజన్ నాటికి ధరలను అమాంతం తగ్గించారు. ఖరీదుదారుల వ్యూహానికి ధరలు నేల చూపులు చూస్తుండడంతో ఎర్ర బంగారం రైతులు బోరుమంటున్నారు. నిరుడు క్వింటా మిర్చిని రూ.22 వేల నుంచి రూ.23 వేల మధ్య కొనుగోలు చేయడంతో అన్నదాతలు ఈ పంట సాగుకు ఆశలు పెంచుకున్నారు. ఈ ధర మరికొంత పెరుగుతుందేమోనని కొందరు రైతులు కోల్డ్ స్టోరేజీల్లో భద్రపర్చుకున్నారు. ఇప్పుడు ధరలు దారుణంగా తగ్గడంతో నెత్తీనోరూ బాదుకుంటున్నారు. అలాగే, నిరుడు మంచి ధర పలికినందున ఈ ఏడాది కూడా అదే ధరలు ఉంటాయనుకొని మరికొందరు అధిక విస్తీర్ణంలో పంటను సాగు చేశారు. కాలం కలిసి రాకున్నా, తెగుళ్లు సోకినా, పెట్టుబడులు గణనీయంగా పెరిగినా వెరవకుండా పంట సాగు చేశారు. రేయింబవళ్లూ చెమటోడ్చి పంటను కల్లాలకు చేర్చారు. తీరా చూస్తే ధర మాత్రం అధఃపాతాళంలో ఉంది. దీంతో మిర్చి రైతులందరూ గుండెలు బాదుకుంటున్నారు. ప్రస్తుతం మార్కెట్లో క్వింటా మిర్చి ధర రూ.12 వేలు మాత్రమే పలుకుతుండడంతో నిలువునా నష్టపోతున్నామంటూ తలలు బాదుకుంటున్నారు. - జూలూరుపాడు/ చర్ల/ చండ్రుగొండ/ ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 18

పంటల సాగులో ఏళ్లకేళ్లుగా వస్తున్న నష్టాలు ఈ సారైనా తీరుతాయన్న ఆశతో ఏటా సాగును కొనసాగిస్తున్నారు ఉమ్మడి ఖమ్మం జిల్లా అన్నదాతలు. ఎన్ని కష్టాలు ఎదురైనా ధైర్యాన్ని కూడగట్టుకొని పంటల సాగులోనే పయనిస్తున్నారు. ఈ క్రమంలో కష్టాలను ఓర్చుకుంటున్నారు. నష్టాలను దిగమింగుతున్నారు. కానీ.. వ్యాపారుల వ్యూహంతో వారు అంతకుమించిన కష్టనష్టాల్లో చిక్కుకుంటున్నారు. అప్పుల ఊబిలో విలవిల్లాడుతున్నారు. ఒక్కోసారి బలవన్మరణాలకూ నిర్ణయం తీసుకుంటున్నారు. ధరల విషయంలో రైతులు ఎలా దగా పడుతున్నారనే అంశం.. కొన్ని మండలాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే పూర్తిగా అవగతమవుతోంది. భద్రాద్రి జిల్లా జూలూరుపాడు, చర్ల మండలాల రైతులు నిరుడు 4 వేల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. క్వింటాకు సుమారు రూ.22 వేల ధర పలకడంతో ఈ ఏడాది మరో వెయ్యి ఎకరాలను పెంచి మొత్తం 5 వేల ఎకరాల్లో మిర్చి పంటను వేశారు. ఎకరాకు సుమారుగా రూ.లక్ష పైగా పెట్టుబడి పెట్టారు. స్థానికంగా కూలీల కొరత ఏర్పడటంతో ఇతర రాష్ట్రాల నుంచి వాహనాల్లో కూలీలను తెప్పించుకొని మరీ మిర్చి పంటలు కోశారు. మిర్చి తోటల వద్ద కూలీలకు అన్ని సౌకర్యాలూ కల్పించారు. ఇలా మిర్చి కోతలకే ఎకరానికి సుమారు రూ.30 వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. కానీ.. ఇంతలా శ్రమించి మిర్చిని కోసి మార్కెట్‌కు తీసుకెళ్తే ధరలు మాత్రం దారుణంగా పతనమై కన్పిస్తున్నాయి. నాణ్యతను బట్టి బహిరంగ మార్కెట్లో క్వింటా మిర్చి ధర రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు మాత్రమే పలుకుతోంది. దీంతో మిర్చి రైతుకు కంటతడి తప్ప మరేమీ లేకుండా పోతోంది. మరుసటి ఏడాది వరకూ కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచుదామంటే ఇప్పుడు పెట్టుబడులు పూడే మార్గం కన్పించడం లేదు. పైగా నిరుటి అనుభవం దృష్ట్యా అప్పటి ధర ఎలా ఉంటుందోనన్న అనుమానాలు వెంటాడుతున్నాయి. దీంతో కొందరు రైతులు ఇదే ధరలకు తెగనమ్ముకుంటుండగా.. మరికొందరు రైతులు మాత్రం తమ పంటను కల్లాల్లోనే నిల్వ ఉంచుకొని ధరల పెరుగుదల కోసం ఎదురుచూస్తున్నారు.

జనవరి వరకూ రూ.18 వేలుగా ఉండి..

ధరల విషయంలో మిర్చి రైతులు ఎలా దగా పడుతున్నారో ఇటీవలి వాటి కదలికలు చూస్తే పూర్తిగా అవగతమవుతోంది. ఇల్లెందు, చండ్రుగొండ మండలాల్లో క్వింటా మిర్చి ధర సుమారు రూ.13 వేల నుంచి రూ.14 వేల మధ్య పలుకుతోంది. నాణ్యత ఉన్నప్పటికీ బహిరంగ మార్కెట్లో సుమారు రూ.12 వేలకు మించి పెట్టడం లేదు. జనవరి నెలలో రూ.17 వేల నుంచి రూ.18 వేల వరకూ పలుకగా.. ఫిబ్రవరిలో రూ.13 వేల నుంచి రూ.14 వేల వరకు మాత్రమే పలుకుతోంది. నెల రోజులు తిరగకముందే మరో రూ.6 వేలు తగ్గించి ఖరీదు చేస్తుండడంతో మిర్చి రైతుల ఆశలన్నీ అడియాశలయ్యాయి.

ఏం చేయాలో తోచడం లేదు.

గత కేసీఆర్ ప్రభుత్వంలో క్వింటా మిర్చి పంట ధర రూ.22 పలికింది. ఇప్పుడు ఎక్కడా ఆ ధర పలకడం లేదు. నేను ఆరు ఎకరాల్లో మిర్చి పంట వేశా. గిట్టుబాటు ధర లేకపోవడంతో పంట నంతా కల్లంలో కుప్పగా పోసి ఉంచా. ధరలు లేవు. ఏం చేయాలో పాలుపోవడం లేదు. క్వింటాకు రూ.20 వేల గిట్టుబాటు ధర కల్పించాలి.

–లచ్చు, మిర్చి రైతు, తుంటబాలుతండా, ఇల్లెందు

చాలా నష్టపోయాం

మిర్చి పంటను పండించి చాలా నష్టపోతున్నాం. నాలుగు ఎకరాల్లో మిర్చి సాగుచేశా. పంట చేతికొచ్చింది. దిగుబడి కూడా బాగానే వచ్చింది. కానీ.. మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్ముకుందామంటే ఒక్కసారిగా ధర పడిపోయింది. మిర్చి పంట పండించేందుకు ఎంతో శ్రమకోర్చా. ఎంతో పెట్టుబడి పెట్టా. ఇప్పుడు ఇంతలా నష్టమొస్తోంది.

–బానోత్ శారద, తుంటబాలుతండా, ఇల్లెందు

పెట్టుబడులు కూడా రావడం లేదు..

ఎకరానికి రూ.లక్షన్నర వరకు పెట్టుబడి పెట్టా. మిరప కాయలు కోయడానికి క్వింటాకు రూ.1000 ఖర్చయింది. గ్రామాలకు వచ్చే వ్యాపారులు క్వింటాకు రూ.12 వేలు మాత్రమే చెబుతున్నారు. కూలీల చెల్లింపులు, బాకీల జమల కోసం నాకు ఇప్పుడు డబ్బులు ఎంతో అవసరం. అందుకని ఇదే రేటుకు అమ్ముకోవాల్సి వచ్చింది.

–ఆనంగి తిరుపతయ్య, మిర్చి రైతు, చండ్రుగొండ

ఈ ఏడాది నష్టాలు తప్పవు..

మిర్చి సాగులో ఈ ఏడాది లాభాలు వచ్చే పరిస్థితి లేదు. కనీసం అప్పులు తీరుతాయన్న ఆశ కూడా లేకుండా పోయింది. పండిన పంటను గిట్టుబాటు ధరకు కొనే నాథుడే లేడు. గత కేసీఆర్ ప్రభుత్వంలో మంచి ధర ఉండేది. ఇప్పుడు ధరలు సగానికి సగం తగ్గాయి. అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు.

–ఇమ్మడి సంపత్, మిర్చి రైతు, చండ్రుగొండ

గిట్టుబాటు ధరలేదు..

ఈ ఏడాది మా ప్రాంతంలో మిర్చి పంట సాగు ఆశాజనకంగా లేదు. తోటలకు తెగుళ్లు ఆశించాయి. ఫలితంగా దిగుబడి తగ్గింది. పెట్టుబడి పెరిగింది. పోనీ మార్కెట్లో అమ్ముకుందామంటే కనీసం గిట్టుబాటు ధర కూడా లేదు. ఈ రేటులో అమ్మితే కనీసం పెట్టుబడి కూడా రాదు. పైగా ఇప్పుడు కరెంటు సమస్య వేధిస్తోంది.

–తన్నీరు సుబ్బారావు, రైతు, గొంపల్లి, చర్ల

తెగుళ్లతో దిగుబడి తగ్గింది..

నేను ఎనిమిది ఎకరాలు కౌలుకు తీసుకొని మిర్చి పంట వేశా. మిర్చి తోటలను ఎర్రనల్లి, కంకరు తెగులు ఆశించాయి. వాటి నివారణకు మందులు పిచికారీ చేశా. ఎకరానికి రూ.3 లక్షల వరకూ ఖర్చయింది. కానీ.. దిగుబడి తగ్గింది. ఇప్పుడు మొదటికోత పూర్తయింది. ప్రస్తుత ధరకు అమ్మితే సగానికి సగం నష్టమే వస్తుంది.

–బలుసు వెంకటేశ్వరరావు, రైతు, చింతకుంట, చర్ల

లాభదాయక పంటలు పండించాలి

- కోతుల నివారణకు సోలార్ పవర్ కంచెలు
- పంట చేల వద్దే రైతులతో సమావేశమైన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

రైతులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

కారేపల్లి, ఫిబ్రవరి 18 : రైతులు ఆధునిక పద్ధతులు పాటిస్తూ లాభదాయక పంటలు పండించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. చీమలపాడు, రేలకాయలపల్లి రెవెన్యూ పరిధిలో రైతులు సాగు చేస్తున్న పామాయిల్, డ్రాగన్ ఫ్రూట్స్ తదితర పంటలను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. అక్కడే చెట్టు కింద రైతులతో సమావేశమై సాగు విధానంలో కష్టనష్టాల గురించి అడిగి తెలుసుకున్నారు. కోతుల వల్ల పండించిన పంట చేతికందక నష్టపోతున్నామని రైతులు తమ సమస్యను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కలెక్టర్ సోలార్ పవర్ ద్వారా పంట చుట్టూ విద్యుత్ కంచెలను సబ్సిడీ ద్వారా ఇప్పించేందుకు కృషి చేస్తానని, ప్రతిపాదనలు రూపొందించాలని సంబంధిత శాఖ సిబ్బందిని ఆదేశించారు. అలాగే పంటల సాగుకు సబ్సిడీ ఇవ్వాలని రైతులు కలెక్టర్‌ను కోరారు. ఉపాధిహామీ పథకం ద్వారా నీటి గుంటలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు ముందుకొస్తే వారి పొలాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులను ఉపయోగించి నీటి గుంటలు ఏర్పాటు చేయిస్తామన్నారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య, తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీవో సురేందర్, విద్యుత్ శాఖ ఏడీ ఆనంద్, ఉద్యానవన శాఖ అధికారి వేణు, ఐకేపీ ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు, ఆర్ఐ జార్జి, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

భవిష్యత్ లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలి

ప్రేరణ, శిక్షణ తరగతుల ప్రారంభోత్సవంలో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

కొత్తగూడెం గణేష్ టెంపుల్, ఫిబ్రవరి 18 : భవిష్యత్ లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి ఎదగవచ్చని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. కొత్తగూడెం పట్టణంలోని అంబేద్కర్ భవన్ షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణ, శిక్షణ తరగతులకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతిని ప్రామాణికంగా తీసుకోవద్దని, అది ఒక మెట్టు మాత్రమేనని, ఆ తర్వాత అనేక కోర్సులు చదవాలన్నారు. విద్యార్థి దశలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నానని, పదో తరగతి చదివేటప్పుడు మంచి ఇంజినీర్ అవుదామని అనుకున్నానని, తర్వాత నా లక్ష్యాన్ని మార్చుకొని పట్టుదలతో చదివి కలెక్టర్ అయ్యానని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతోపాటు అన్ని రకాల పుస్తకాలు, సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తున్నదన్నారు. వసతి గృహాల్లో ఉండి చదువుకునే విద్యార్థుల కోసం ప్రత్యేక స్టడీ అవర్స్, ప్రేరణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. వార్డెన్లు ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహించి జిల్లాలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం రిసోర్స్ పర్సన్లు సైదులు, నాగరాజు, శేఖర్, విజయభాస్కర్, శ్యాంచందర్‌రావు వివిధ సబ్జెక్టుల్లో మెలకువలు నేర్పించారు. కార్యక్రమంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి అనసూర్య, ఏఎస్‌డబ్ల్యూవోలు హనుమంతరావు, సునీత, హెచ్‌డబ్ల్యూవోలు గజ్జేల్ శ్రీనివాస్, పద్మావతి, శశిరేఖ, కౌసల్య, రామనర్సయ్య, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత సామర్థ్యాలను వెలికితీయాలి

ఆశ్రమ పాఠశాలల తనిఖీలో ఐటీడీఏ పీవో రాహుల్

చండ్రుగొండలోని గిరిజన ఆశ్రమ పాఠశాల తరగతి గదిలో విద్యార్థులతో పీవో రాహుల్

చండ్రుగొండ, ఫిబ్రవరి 18: విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న సామర్థ్యాలను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. తిప్పనపల్లి ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాల, చండ్రుగొండ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో డిక్టేషన్ చెప్పి, బోర్డుపై తెలుగు, ఇంగ్లిష్ పదాలను రాయించారు. భవిష్యత్‌లో మీరు ఏం కావాలనుకుంటున్నారు? మీ ఊరికి ఏం కావాలి? మీ పాఠశాలకు ఏం కావాలి? అనే ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. పాఠశాలలో నెలకొన్న సమస్యల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. కోతుల సమస్య ఉందని చెప్పగా.. సోలార్ ఫెన్సింగ్ వేయిస్తానని, త్వరలోనే పనులు ప్రారంభమయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. పాఠశాల మరమ్మతు పనులకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. విద్యార్థినులకు ప్రత్యేకంగా ఇచ్చిన ఉద్దీపకం పుస్తకాన్ని చదివి, రాయించాలన్నారు. గణితంపై పట్టు సాధించేలా ఉపాధ్యాయులు 1 నుంచి 5 తరగతి విద్యార్థినులపై శ్రద్ధ పెట్టాలన్నారు. పీవో వెంట పాల్వంచ ఆశ్రమ పాఠశాల హెచ్ఎం భద్రు, ఏటీడీవో చంద్రమోహన్, హెచ్ ఎంలు సునీత, ఇస్లావత్ వీరన్న ఉన్నారు.

ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటుచేయాలి

ఏఎంసీ ఎదుట రైతుల ధర్నా

ఖమ్మం వ్యవసాయ మార్కెట్ మిర్చి యార్డు వద్ద ధర్నా చేస్తున్న రైతులు

మార్కెట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు, రైతు సంఘం నాయకులు

రఘునాథపాలెం, ఫిబ్రవరి 18: ఖమ్మంలో మిర్చి బోర్డును ఏర్పాటు చేయాలని రైతు సంఘాల నాయకులు, రైతులు డిమాండ్ చేశారు. క్వింటా మిర్చికి రూ.25 వేలు ధర నిర్ణయించాలని, ఆ ధర ప్రకారం రైతుల నుంచి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. ఈ మేరకు ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఎదుట మంగళవారం వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం అనుబంధ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ.. ఏఎంసీలో దళారుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని, మిర్చికి మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. అత్యధిక విస్తీర్ణంలో మిర్చి సాగయ్యే ఖమ్మం జిల్లాలో మిర్చి బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నాఫెడ్, మార్క్‌ఫెడ్ సంస్థల ద్వారా క్వింటాకు రూ.25 వేల చొప్పున నిర్ణయించి కొనుగోలు చేయాలన్నారు. గత సీజన్‌లో క్వింటాకు రూ.25 వేలుగా ఉన్న ధర ఇప్పుడు రూ.12 వేలు కూడా పలికే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘం నాయకులు, సీపీఎం నేతలు తదితరులు పాల్గొన్నారు.

ధరలు పడిపోయాయి.. పెట్టుబడులు రెట్టింపయ్యాయి..

నిరుటితో పోలిస్తే మర్చి ధరలు సగానికి సగం పడిపోయాయని, కానీ పెట్టుబడులు మాత్రం రెట్టింపయ్యాయని సీపీఐ అనుబంధ రైతు సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటుచేయాలని, గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ అనుబంధ రైతు సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం ఏఎంసీ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ అనుబంధ తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు ఆధ్వర్యంలో సంఘం నేతలు ఖమ్మం ఏఎంసీలో మిర్చి కొనుగోళ్లను అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. దీంతో వీరిని పోలీసులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకొని ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు.. నిరసన వద్దకు వచ్చారు. వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసి మిర్చి ధర పెంపునకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సీపీఐ నేతలు, అనుబంధ రైతు సంఘ నేతలు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన ఫారెస్ట్ రేంజర్, బీట్ ఆఫీసర్

కొమరారంలో రూ.30 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

కొమరారం ఫారెస్ట్ రేంజర్ కార్యాలయంలో ఏసీబీ అధికారులకు పట్టుబడిన రేంజర్ ఉదయ్‌కిరణ్, బీట్ ఆఫీసర్ హరిలాల్

ఇల్లెందు, ఫిబ్రవరి 18: రోడ్డు నిర్మాణ పనులకు గ్రావెల్ తోలుకునేందుకు ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.30 వేలు లంచం డిమాండ్ చేసిన అటవీ శాఖ రేంజర్, బీట్ ఆఫీసర్‌ను ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం కొమరారం ఫారెస్ట్ రేంజర్ కార్యాలయంలో మంగళవారం చోటు చేసుకుంది. ఏసీబీ డీఎస్పీ రమేశ్ కథనం ప్రకారం.. కొమరారం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని బోయినతండాలో రోడ్డు నిర్మాణ పనులకు గ్రావెల్ తోలుకునేందుకు ఓ కాంట్రాక్టర్ అటవీ శాఖ రేంజర్ ఉదయ్ కిరణ్, బీట్ ఆఫీసర్ నూనావత్ హరిలాల్‌ను సంప్రదించగా.. వారు రూ.30 వేలు డిమాండ్ చేశారు. దీంతో సదరు కాంట్రాక్టర్ రూ.30 వేలు ఇస్తానని చెప్పిన తర్వాత ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారు పన్నిన పథకం ప్రకారం.. మంగళవారం కొమరారం రేంజర్ కార్యాలయంలో సదరు కాంట్రాక్టర్.. రేంజర్, బీట్ ఆఫీసర్‌కు రూ.30 వేలు లంచం ఇస్తుండగా అక్కడే మాటువేసిన ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా వారిని పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరపర్చనున్నట్లు ఏసీబీ డీఎస్పీ రమేశ్ తెలిపారు. అవినీతికి పాల్పడే ప్రభుత్వ అధికారులు, సిబ్బంది వివరాలను మా దృష్టికి తీసుకొస్తే పట్టుకొని కేసులు నమోదు చేస్తామని, దీనికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

పోర్టబిలిటీకి పంగనామాలు!

- రేషన్ బియ్యం సరఫరాపై చేతులెత్తేసిన అధికారులు
- గోదాముల్లో బియ్యం లేవంటూ సమాధానం
- జిల్లాలో ఫిబ్రవరి నెల 'అదనపు కోటా' లేనట్లే!
- నేటితో ముగుస్తున్న పంపిణీ గడువు.. అయోమయంలో డీలర్లు
- డీలర్లపై దాడులకు దిగుతున్న లబ్ధిదారులు?



Sk Janimiya Ration Union
ఖమ్మం జిల్లా రేషన్ డీలర్స్ మిత్రులకు నమస్కారం
ఈరోజు జిల్లా కమిటీ నాయకులు డిఎం గారి ఆఫీసులో డి ఎం గారికి కోసం వెయిట్ చేసి మేడం గారు ఆఫీసుకు రాకపోవడంతో జిల్లా అధ్యక్షుడు ఫోన్ ద్వారా మేడం తో మాట్లాడగా బియ్యం ఎక్కడ స్టాక్ లేని కారణంగా పోర్టబులిటీ రైస్ ఇవ్వటం సాధ్యపడదు అని తెలియజేసినారు
ఇట్లు
బాణోత్ వెంకన్న
జిల్లా అధ్యక్షులు
&
కార్యవర్గం
1398/2014

ఫిబ్రవరి నెల పోర్టబిలిటీ రైస్ సరఫరా లేదని డీఎం చెప్పినట్లు డీలర్లకు గ్రూప్‌లో షేర్ చేసిన యూనియన్ నేత

రఘునాథపాలెం, ఫిబ్రవరి 18: ఖమ్మం జిల్లాలో రేషన్ షాపులకు బియ్యం చేరడం గగనమై పోతున్నది. ప్రజాపంపిణీకి చెందిన షాపులకు రేషన్ అలాట్‌మెంట్‌ను చేరవేయలేక అధికారులు ఆపసోపాలు పడుతున్నారు. ఫిబ్రవరి నెలకు సంబంధించిన పోర్టబిలిటీ బియ్యం పంపిణీకి అధికారులు పుల్‌స్టాప్ పెట్టారు. ఈ నెల పోర్టబిలిటీ బియ్యం సరఫరా లేదంటూ రేషన్ డీలర్లకు తేల్చి చెప్పారు. ఫలితంగా జిల్లాలో వేలాది మంది లబ్ధిదారులకు ఫిబ్రవరి నెల రేషన్ బియ్యం లేకుండాపోయాయి. అయితే నిత్యం రేషన్ షాపుల చుట్టూ బియ్యం కోసం ప్రదక్షిణలు చేస్తున్న లబ్ధిదారులు డీలర్లతో ఘర్షణకు దిగుతున్నారు. కొన్నిచోట్ల దాడులకు సైతం పాల్పడుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఏ జిల్లా గోదాముల్లోనూ రేషన్ బియ్యం లేవని, పోర్టబిలిటీ రేషన్ చేరవేయలేమని అధికారులయితే ఖరాకండీగా చెప్పేశారు.. కానీ.. నిన్నటివరకు అదనపు అలాట్‌మెంట్ వస్తుందని లబ్ధిదారులకు చెప్పిన రేషన్ డీలర్లు ఇక బియ్యం లేవనే సమాధానం వారికి చెప్పలేక భయాందోళన చెందుతున్నారు. క్షేత్రస్థాయిలో ఉండే తమకి లబ్ధిదారుల నుంచి ఈసడింపులు, ఛీత్కారాలు తప్పవనే భయంలో ఉన్నారు.

వన్ నేషన్.. వన్ రేషన్

వన్ నేషన్.. వన్ రేషన్ విధానం అమలులోకి వచ్చినంక రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులు ఏ రేషన్ షాపునకు వెళ్లినా బియ్యం తెచ్చుకోవచ్చు. డీలర్లు సైతం వేరే రాష్ట్రం, జిల్లా, మండలం అని చెప్పకుండా షాపునకు వచ్చిన లబ్ధిదారుడికి బియ్యం పంపిణీ చేస్తారు. ఇతర ప్రాంతాలకు చెందిన రేషన్ కార్డులు రావడంతో ఆయా షాపులకు ఉన్న అలాంట్‌మెంట్ త్వరితగతిన పూర్తవుతుంది. దీంతో సదరు డీలర్లు షాపు పరిధిలోని మిగిలిన లబ్ధిదారులందరికీ రేషన్ అందజేయాలనే ఉద్దేశంతో అవసరం మేరకు ఈ-పాస్ మిషన్‌లో ప్రభుత్వం కల్పించిన 'పోర్టబిలిటీ' ఆప్షన్ ద్వారా అదనపు కోటాకు అర్జీ పెట్టుకుంటారు. ఈ అర్జీని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి పరిశీలించి మంజూరు చేసి రేషన్ షాపులకు సదరు బియ్యం సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటారు. ఈ పోర్టబిలిటీ రేషన్ ప్రధానంగా పట్టణం, మున్సిపాలిటీ, పురపాలక ప్రాంతాల్లోని రేషన్ షాపులకు మాత్రమే అవసరమవుతుంది.

నేటితో గడువు పూర్తి..

రేషన్ షాపునకు ఉన్న అలాట్‌మెంట్ పూర్తయిన వెంటనే డీలర్లు ప్రతి నెలా 8, 9వ తేదీల్లోగా పోర్టబిలిటీ రిక్వెస్ట్ పెట్టుకుంటారు. అధికారి 10వ తేదీకల్లా అప్రూవల్ చేసి షాపులకు రేషన్ దిగుమతి చేస్తారు. కానీ.. ఫిబ్రవరి నెల ఆ పరిస్థితి లేకపోయింది. 18వ తేదీ వచ్చినా పోర్టబిలిటీ రిక్వెస్ట్ అప్రూవల్‌కు నోచుకోలేదు. నేటితో ఈ నెల రేషన్ పంపిణీ గడువు పూర్తికానుండడంతో షాపు పరిధిలో కార్డుదారుల నుంచి ఎలాంటి ఇబ్బందులు తలెత్తుతాయోనని రేషన్ డీలర్లు భయపడుతున్నారు.